సాక్షి అనకాపల్లి

మంగళవారం : 13 : మే : 2025



రెవెన్యూ సమస్యలే అధికం

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు రెవెన్యూ సమస్యలే అధికంగా వస్తున్నాయి. పరిష్కారంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. 8లో

ఉష్ణోగ్రతలు

సోమవారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	36.8/26.4
చోడవరం	:	38.0/27.0



అన్నమయ్యకు నీరాజనం

ఏయూక్యాంపస్: అన్నమయ్య జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సోమవారం బీచ్ రోడ్డులో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

సామాజిక కార్యకర్తపై దాడి: డీజీపీకి ఫిర్యాదు

నర్సీపట్నం: పట్టణంలో రామారావుపేటకు చెందిన సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజుపై మార్చి 19న జరిగిన దాడిపై అమరావతి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ చెప్పారు. కేసు దర్యాప్తు విషయంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పేరు చెప్పి దాడి చేసిన వ్యక్తులు రాజ్యాంగానికి అతీతులు కారని డీజీపీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. చర్యలు తీసుకోలేని పక్షంలో హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు.

దేవరాపల్లి హైస్కూల్లో నాగుపాము కలకలం



దేవరాపల్లిలో నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం నాగుపాము హడావుడి సృష్టించింది. హైస్కూలు ఆవరణలో చేపడుతున్న బాలికల వసతి గృహ నిర్మాణ పనుల కోసం తీసిన గొయ్యిలో ఎలుకను మింగేసి కదలలేని స్థితిలో ఉన్న నాగుపామును స్థానికులు గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారుల ద్వారా స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం అందించారు. నిచ్చెన సహాయంతో గొయ్యిలోకి దిగిన స్నేక్ క్యాచర్ సుమారు అరగంటపాటు శ్రమించి మూడున్నర అడుగుల పొడవున్న నాగుపామును పట్టుకొని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 13న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వీసీ హాల్, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

వర్ష సూచన నేపథ్యంలో..

రైతులకు ఆర్ఏఆర్ఎస్ సూచనలు

అనకాపల్లి: ఈనెల 14న వర్ష సూచన ఉందన్న వాతావరణ శాఖ సమాచారంతో కోత దశలో ఉన్న నువ్వుల పంటను వెంటనే కోసుకుని నీడలో ఆరబెట్టుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే కోసిన పైరు పొలంలో ఉంటే కుప్పగా వేసుకుని టార్పాలిన్ షీట్‌తో కప్పాలి లేదా నీడలో ఆరబెట్టాలన్నారు. చెరకు పొలంలో చేరిన అధిక నీటిని బయటకు తీసివేయాలని, వర్ష సూచన ఉన్నందున ఎరువులు వేయడం, పురుగు/తెగుళ్ల మందులు పిచికారీ చేయడం వాయిదా వేసుకోవాలన్నారు. అరటి తోటలో వర్షం వలన గెలలు పడిపోయే, పళ్ల నాణ్యత తగ్గే అవకాశం ఉన్నందున పక్వానికి వచ్చిన అరటి గెలలను కోసి వెంటనే మార్కెట్‌కు తరలించాలన్నారు. పక్వానికి వచ్చిన మామిడి, బొప్పాయిని తక్షణమే కోసి వేయాలని సూచించారు. కూరగాయ పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అక్రమ మైనింగ్ కేసులో రూ.50 వేల జరిమానా

రావికమతం: గుడివాడ రెవెన్యూ పరిధిలో కొండపై అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న పొక్లెయిన్ యాజమానికి రూ.50 వేల అపరాధ రుసుం విధించి కట్టించామని రావికమతం మండల తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఏప్రిల్ 23న ప్రభుత్వ భూమి ఉన్న 338-2 సర్వే నంబర్‌లో అక్రమంగా బ్లాక్ మెటల్ తవ్వుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆర్ఐ సతీష్ విచారణ జరిపి పొక్లెయిన్‌ను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. తదుపరి చర్యల కోసం ఈ కేసును భూగర్భ గనుల శాఖకు అప్పగించారు. మైనింగ్ ఏడీ విచారణ జరిపి పొక్లెయిన్ యాజమానికి రూ.50 వేల అపరాధ రుసుం విధించి కట్టించామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. పొక్లెయిన్ యాజమాని యశ్వంత్ అపరాధ రుసుం చెల్లించడంతో పొక్లెయిన్ తాళాన్ని సోమవారం అందజేశారు.

కలలు కల్లలు

ఆయిల్‌పామ్ రైతులకు ఆశాభంగం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లాభాల బాట
- ఆయిల్‌పామ్ కార్పొరేషన్ చొరవతో గిట్టుబాటు ధరలు
- ఆదాయం బాగుందని సాగు విస్తీర్ణం పెంచిన రైతులు
- ప్రస్తుతం టన్నుకు రూ.23,500 నుంచి రూ.20 వేలకు పడిపోయిన ధర
- కూటమి సర్కారు ఉదాశీనతపై రైతుల్లో అసంతృప్తి



చమ్మచింత కొనుగోలు కేంద్రంలో ఆయిల్‌పామ్ గెలలు

ఆయిల్ పామ్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయిల్ పామ్ గెలలకు ధర బాగుందని కొత్తగా రైతులు తోటలు వేస్తుండగా, కూటమి అధికారంలోకి వచ్చాక గెలల ధర గణనీయంగా పడిపోయింది. దీంతో ఆయిల్‌పామ్ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆయిల్‌పామ్ కార్పొరేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడంతో వారిని పట్టించుకునే వారే కరువయ్యారు.



ఆయిల్‌పామ్ గెలలను లారీలపై లోడు చేస్తున్న కూలీలు

నాతవరం: ఆయిల్‌పామ్.. అన్నీ అనుకూలిస్తే రైతులకు మూడేళ్ల నుంచే లాభాలను చవి చూపించే పంట. గత ప్రభుత్వ చర్యలతో వారి ఆదాయం మరింత పెరిగింది. అందుకే జిల్లాలో 24 వేల ఎకరాల లోపు ఉండే ఆయిల్‌పామ్ విస్తీర్ణం ప్రస్తుతం 28 వేలు దాటింది. కానీ ఏం లాభం.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తగిన ధర రాక రైతులు దిగాలు పడుతున్నారు. నాతవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల, రావికమతం, చోడవరం, రోలుగుంట, ఎస్.రాయవరం, కశింకోట, బుచ్చెయ్యపేట, గొలుగొండ, నర్సీపట్నం, పాయకరావుపేట, చీడికాడ, మాడుగుల మండలాల్లో ఆయిల్‌పామ్ తోటలు అధికంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆయిల్‌పామ్ కార్పొరేషన్ నెలకొల్పి చైర్మన్‌ను, డైరెక్టర్లను నియమించడంతో వారు ప్రైవేటు కంపెనీలతో మాట్లాడి ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.23,500 వరకు ధర చెల్లించేలా శ్రద్ధ తీసుకునేవారు. ప్రస్తుతం రైతుల నుంచి రూ.20 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దాంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో పోల్చుకుంటే ఇప్పుడు గెలలు కోయడానికి కూలీ రేట్లు రెట్టింపు చేశారు. క్రిమిసంహారక మందులు, ఎరువులు, పెట్టుబడి ఖర్చులు దారుణంగా పెరిగిపోయాయి. గోరుచుట్టుపై రోకలి పోటులా సేకరణ ధర కూడా తగ్గడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఆయిల్‌పామ్ గెలలను సోయారుచి ప్రైవేటు కంపెనీ యాజమాన్యం మాత్రమే కొనుగోలు చేస్తోంది.

ఆశ.. నిరాశ

ఎనిమిది నుంచి 14 ఏళ్ల వయస్సు గల ఆయిల్‌పామ్ తోటలో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పంట సంరక్షణ, వాతావరణం అనుకూలిస్తే దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఎకరానికి పెట్టుబడి రూ.40 వేల నుంచి రూ.50 వేలు మధ్య అవుతుందని రైతులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు ఉద్యావన శాఖ ద్వారా మొక్కలు రాయితీపై అందిస్తున్నారు. సాగు చేసేందుకు బావి లేదా బోరుతోపాటు విద్యుత్ సదుపాయం కలిగి ఉండాలి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన మూడేళ్ల నుంచి తోట సంరక్షణను బట్టి పంట కాపు దశకు వస్తుంది. అంతవరకు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో, అరటి, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ఆయిల్‌పామ్ తోటల ద్వారా ఆదాయం బాగుందని రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితిని బట్టి చూస్తే పెట్టుబడి, రేట్లు దారుణంగా పెరిగాయి. రైతులు పండించిన ఆయిల్‌పామ్ గెలల రేటు తగ్గడంతో దిగాలు చెందుతున్నారు.



సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలు

ప్రభుత్వం పట్టించుకోవాలి



మా గ్రామంలో ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రం ఉంది. కార్పొరేషన్ చొరవతో గత వైఎస్సార్‌సీపీ హయాంలో టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.23,500 చెల్లించేవారు. ప్రస్తుతం టన్ను గెలల ధర రూ.20 వేలకు పడిపోవడంతో మా రైతులంతా లబోదిబోమంటున్నారు. ఎరువులు, క్రిమిసంహార మందులు, కూలీలు రేట్లు మాత్రం గణనీయంగా పెరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రైవేటు కంపెనీలతో మాట్లాడి మంచి రేటు వచ్చేలా చూడాలి.

– సందీప్, రైతు, చమ్మచింత గ్రామం

మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసుల తీరు దారుణం



వైఎస్సార్‌సీపీ మహిళా నేత ఈర్లె అనురాధ

దేవరాపల్లి: బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, మహిళా నాయకురాలు విడదల రజని పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కొరవడిందని, మాజీ మంత్రి రజనిపై పోలీసులు వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనమన్నారు. తారువలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 'సీఐ గారు ఏమిటి విషయమ'ని మర్యాదపూర్వకంగా అడిగిన మాజీ మంత్రిపై సదరు సీఐ దురుసుగా ప్రవర్తించడంతోపాటు 'నీపై కూడా కేసులు పెడతామం'టూ బెదిరింపులకు దిగడం అత్యంత దారుణమన్నారు. మాజీ మంత్రి పట్ల పోలీసులు ఇలా వ్యవహరిస్తే.. రాష్ట్రంలో సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. తమ 11 నెలల పాలనలో వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారిపై ఇలా కక్ష సాధింపులకు దిగుతూ, అరాచకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలను గౌరవిస్తాం, రక్షణ కల్పిస్తామని చెబుతున్న కూటమి నేతలకు మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పోలీస్ వ్యవస్థకు మచ్చ తెచ్చేలా వ్యవహరించిన సీఐపై చర్యలు తీసుకోవడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, అనకాపల్లి: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. ఉదయం ఫస్టియర్ పరీక్షకు మొత్తం 2150 మందికి గాను 2027 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 680 మందికి గాను 622 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.సుజాత తెలిపారు.

పాయకరావుపేట పీహెచ్‌సీలో టీడీపీ నేత దౌర్జన్యం

- విధుల్లో ఉన్న ఫార్మసిస్టుపై చిందులు
- తన మనిషికి తక్షణం పనిచేసి పెట్టలేదని ఆగ్రహం
- వైద్యం మానేసి వెంటనే రావాలని ఒత్తిడి

పాయకరావుపేట: స్థానిక టీడీపీ ఎంపీటీసీ భర్త వేములపూడి అప్పారావు పీహెచ్‌సీ ఫార్మసిస్ట్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై దూషణలకు దిగారు. అధికార పార్టీ ఎంపీటీసీ భర్తను వస్తే కనీస గౌరవం లేకుండా కూర్చొబెట్టి మాట్లాడకుండా నీ అంతట నీవు వెళ్లిపోతావా..? అంటూ బెదిరింపులకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం మధ్యాహ్నం సమయంలో వేములపూడి అప్పారావు పాయకరావుపేట పీహెచ్‌సీకి ఒక కూటమి కార్యకర్తను ఆధార్ అథంటికేషన్ కోసం తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యం చేస్తున్న ఫార్మాసిస్టును.. పని మానేసి తాను పంపించిన వ్యక్తికి వెంటనే పనిచేసి పెట్టాలని డిమాండ్ చేశారు. పేషెంట్‌కు సీరియస్‌గా ఉంది ఇంజక్షన్ చేసి వస్తానని ఫార్మసిస్ట్ చెప్పినా వినిపించుకోలేదు. 'రాజకీయ నాయకులంటే నీకు విలువ లేదు.. నిన్ను ఎక్కడకి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానో చూడు...నీ పూర్తి పేరు చెప్పు' అంటూ చిందులు తొక్కారు. ఇంజక్షన్ చేసి వస్తానని చెప్పినా వినకుండా.. నీ అంతు చూస్తా.. హోం మంత్రికి ఫిర్యాదు చేస్తా.. అంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు.

అన్న ట్యాబ్‌లో గేమ్‌లు ఆడవద్దన్నాడని..

- బాలిక బలవన్మరణం
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి



యమున మృతదేహం


కె.కోటపాడు: ట్యాబ్‌లో గేమ్‌లు ఆడుతోందని అన్న మందలించడంతో క్షణికావేశంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. పాచిలవానిపాలెం గ్రామానికి చెందిన పాచిల యమున (16) గత నెల 27న ట్యాబ్‌లో గేమ్‌లు ఆడడం చూసి అన్న జయంత్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బాలిక.. తల్లిదండ్రులు పాచిల వరలక్ష్మి, శ్రీరామ్మూర్తి, అన్న జయంత్ పొలం పనులపై మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాక ఉరి వేసుకుంది. ఇంటికి తిరిగి వచ్చిన తల్లి యమున ఫ్యాన్‌కు వేలాడడం గమనించి భర్తకు తెలపగా కుమార్తెను హుటాహుటిన చోడవాడ పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లిలో గల ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 2 వరకూ అక్కడే వైద్యం అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు యమునను అదే రోజు విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న యమున ఆరోగ్య పరిస్థితి మరింత విషమించి ఈనెల 11వ తేదీ ఆదివారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందింది. యమున మృతిపై కె.కోటపాడు పోలీసులకు మేనమామ దొగ్గ కృష్ణ సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ విచారణ జరుపుతున్నారు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక శవాన్ని బంధువులకు అప్పగించారు.

ఈ ఏడాది పదిలో 531 మార్కులు

ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో మృతురాలు పాచిల యమున 531 మార్కులు సాధించింది. యమున ప్రతి పరీక్షలో మంచి మార్కులు సాధించేదని బంధుమిత్రులు తెలిపారు. యమున 8వ తరగతి నుంచి ప్రస్తుతం 10 వరకు తానాం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంది. ఇంటర్మీడియట్‌లో చేరాల్సి ఉన్న ఆ బాలిక అన్నతో జరిగిన ఘర్షణ కారణంగా క్షణికావేశంలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకుంది.

అవిశ్వాస తీర్మానంపై సమావేశం మినిట్స్ ఇవ్వండి

కలెక్టర్‌కు తైనాల, రవిరెడ్డి వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల, వైఎస్సార్ సీపీ నేత రవిరెడ్డి

మహారాణిపేట (విశాఖ): జీవీఎంసీ ప్రత్యేక సమావేశం మినిట్స్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి రవిరెడ్డి కోరారు. గత నెల 19న జరిగిన ఈ సమావేశం ప్రక్రియల మినిట్స్, వాటి ప్రతిని వెంటనే అందించాలన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న తాను రాసిన లేఖకు ఈ వినతి అనుసంధానంగా ఇస్తున్నట్లు తైనాల విజయకుమార్ పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానంపై చర్చించిన సమావేశం వివరాలు, చేపట్టిన చర్యల మినిట్స్ కాపీని అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియమిత పార్టీ విప్‌గా, తాను కోరిన పత్రాలను వీలైనంత త్వరగా అందజేయాలన్నారు. గతంలో తాము ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలన్నారు.

గురువులకు సర్దుపోటు!

- ఉపాధ్యాయుల్లో బదిలీల గుబులు
- తుదిదశకు ఖాళీల కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో భారీగా సర్‌ప్లస్ టీచర్లు
- మోడల్ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లు
- సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు గండం



విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలకు నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్న నేపథ్యంలో స్కూళ్లలో ఎక్కడెక్కడ ఏ పోస్టులు ఖాళీ ఉన్నాయనే లెక్క తీసే పనిలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం తలమునకలై ఉంది. మంగళవారం నాటికి వాస్తవ ఖాళీలను ధ్రువీకరించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని ఎంఈవోలు, డీఈవో కార్యాలయ సిబ్బంది అంతా ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ఎంఈవోలను తన కార్యాలయానికి పిలిపించి.. వారి సమక్షంలోనే వాస్తవ ఖాళీలను లెక్క తీసి, వాటిని ధ్రువీకరించేలా డీఈవో ప్రేమ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో సోమవారం రాత్రి కూడా డీఈవో కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది అంతా క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహించారు.

జిల్లాలో ఏడు రకాల బడులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా జిల్లాలో ఏడు రకాల బడుల ఏర్పాటుకు ప్రస్తుత ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 3,158 పాఠశాలలు ఉండగా ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా ఏడు రకాలుగా బడులు (ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, మోడల్ ప్రాథమిక, యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు) కూర్పు చేసి ఇక్కడి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. 2024 డిసెంబర్ నాటికి స్కూళ్లలో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను లెక్క కట్టి, ఇందుకనుగుణంగానే ఖాళీల జాబితాలను సిద్ధం చేశారు.

ఎస్జీటీ పోస్టులకు గండం

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారుగా 596 మోడల్ ప్రాథమిక స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను కేటాయిస్తున్నారు. కాగా వీటిలో ప్రధానోపాధ్యాయుడిగా స్కూల్ అసిస్టెంట్‌ను నియమించనున్నారు. దీంతో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు గండిపడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

హైస్కూళ్లలో భారీగా సర్‌ప్లస్ టీచర్లు

కొత్తగా ఏర్పాటు కాబోయే స్కూళ్లకు అనుగుణంగా పోస్టులు రేషనలైజేషన్ చేపట్టగా, హైస్కూళ్లలో భారీగా మిగులు ఉపాధ్యాయులు లెక్క తేలారు. గణితం, ఫిజికల్ సైన్సు, ఇంగ్లిష్ పోస్టుల్లో పనిచేసే వారే ఎక్కువగా మిగులుగా తేలారు. తాజా లెక్కల ప్రకారం సుమారుగా 234 మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ కాబోతున్నారు. వీరందరినీ మోడల్ ప్రాథమిక స్కూళ్లలో సర్దుబాటు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

గుబులు మొదలు

రేషనలైజేషన్ ప్రక్రియతో ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది. బదిలీలకు అంతా సిద్ధం చేస్తున్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో భారీగా సర్‌ప్లస్‌లో ఉపాధ్యాయులు ఉండటంతో.. బదిలీల్లో ఎక్కడికి స్థానభ్రంశం కలుగుతుందోనన్న ఆందోళన ఉపాధ్యాయుల్లో మొదలైంది. డీఈవో కార్యాలయ అధికారులు ప్రకటించిన ఖాళీల జాబితాలతో తాము ఎక్కడికి బదిలీపై వెళ్లాలనే దానిపై ఉపాధ్యాయులు లెక్కలేసుకుంటున్నారు. రేషనలైజేషన్ మేరకు ఏ పోస్టులు పోతున్నాయి? ఏ పోస్టులు మిగులుతున్నాయనే విషయాన్ని డీఈవో కార్యాలయ అధికారులు ఎప్పుడు ప్రకటిస్తారా అని ఉపాధ్యాయులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఏయూ వీసీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (హైదరాబాద్) అందించిన ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాదులోని ఐఐసీటీలో జరిగిన నేషనల్ టెక్నాలజీ డే కార్యక్రమంలో అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు ఆచార్య రాజశేఖర్ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును అందించడం పట్ల విశ్వవిద్యాలయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

చోడవరం: మహిళను హత్య చేసిన కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం జోడిగూడ గ్రామానికి చెందిన కిల్లో దయత్రి రఘునాథ్ (50)కి ఈ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రత్నకుమార్ తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. కిల్లో దయత్రి రఘునాథ్ కల్లు చెట్ల యజమాని. అదే గ్రామానికి చెందిన కిల్లో ముకుంద్‌కి జీలుగు చెట్టును లీజుకు ఇచ్చి రోజూ అతని దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. ఈ క్రమంలో దయత్రి రఘునాథ్, ముకుంద్ మధ్య 2013 ఫిబ్రవరిలో గొడవ జరిగింది. ముకుంద్ ఇంటికి వెళ్లి రఘునాథ్ గొడవ పడుతున్న సమయంలో ముకుంద్ భార్య కిల్లో లక్ష్మి వారిని వారించేందుకు ప్రయత్నించింది. రఘునాథ్ ఆగ్రహంతో లక్ష్మిని ఇనుపరాడ్డుతో బలంగా కొట్టడంతో తలకు దెబ్బతగిలి తీవ్రగాయాలపాలయ్యింది. గాయపడిన లక్ష్మిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడు హత్యకు పాల్పడ్డాడని అరకు సీఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఐపీసీ 324, 448, 302 సెక్షన్లు పెట్టారు. కేసు చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణకు రాగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకట్రావు బాధితుల తరఫున వాదనలు వినిపించి, నేరం రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి రత్నకుమార్ తుది తీర్పు చెప్పారు. నేరం రుజువు కావడంతో లక్ష్మిని హత్య చేసినందుకు ముద్దాయి కిల్లో దయత్రి రఘునాథ్‌కు జీవిత ఖైదు, రూ.13 వేల జరిమానా విధించారు.

సింహగిరికి వైశాఖ పౌర్ణమి శోభ



భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు కుటుంబసమేతంగా పెద్ద సంఖ్యలో సింహాచలం తరలివచ్చారు. తొలుత కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. వంటలు వండుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. కోలలతో నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. గరిడీ నృత్యాలు చేశారు. మెట్లమార్గం ద్వారా నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. స్నానమాచరించేందుకు తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి ప్రాంగణం కిక్కిరిసింది. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహగిరిపై దర్శన క్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, భక్తులతో నిండిపోయాయి. వరాహ పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం గార్డులు బందోబస్తు నిర్వహించారు. పుష్కరిణి మార్గంలో ఎలాంటి వాహనాలు వెళ్లకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

జగ్గప్పారావుకు జ్ఞానీ జైల్‌సింగ్ పురస్కారం



ప్రభుత్వ సలహాదారు షరీఫ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జగన్

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లికి చెందిన సామాజిక కార్యకర్త బొడ్డేడ జగ్గప్పారావు (జగన్) జ్ఞానీ జైల్ సింగ్ అవార్డును దక్కించుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన సత్కార కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షరీఫ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. వరల్డ్ ప్రెస్ ఫ్రీడం డే, ఏపీ జేయూ 5 వసంతాల వార్షికోత్సవంలో భాగంగా జగన్‌ను సత్కరించారు. ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ , వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో జగన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సహచట్టం, వినియోగదారుల హక్కు చట్టం తదితర కార్యక్రమాలపై జగ్గప్పారావు విస్తృత ప్రచారం చేస్తూ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలే అధికం

- పీజీఆర్ఎస్‌లో పరిష్కారం కాని అర్జీలు
- అర్జీని ఎండార్స్‌మెంట్‌తో ముగిస్తున్న అధికారులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బార్క్ నిర్వాసితులు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రోజురోజుకు ప్రజల మన్ననలు కోల్పోతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకుండానే ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతకు పీజీఆర్ఎస్ కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని అధికారులు, పాలకులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు చేసుకున్న అర్జీలకు పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు. జిల్లా స్థాయి అధికారి ధ్రువీకరణతో సమస్యపై ఎండార్స్‌మెంట్ మాత్రం ఇస్తున్నారని తెలిపారు. సోమవారం ఎండ తీవ్రంగా ఉండడంతో కలెక్టరేట్ వద్ద నిరసనల సంఖ్య తగ్గింది. పీజీఆర్ఎస్ వేదిక నుంచి ఇంచార్జి కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు, జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి-170, పంచాయతీ రాజ్ -25, పోలీస్-13, ఇతర శాఖల్లోను ఫిర్యాదులు నమోదయ్యాయి.

బార్క్ నిర్వాసితుల నిరసన

బార్క్ నిర్వాసితుల జాబితాలో కక్షపూరితంగా తమ పేర్లు తొలగించారంటూ అచ్చుతాపురం మండలం తంతడి శివారు యాతపాలేనికి చెందిన 30 మందికి పైగా నిర్వాసితులు కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. బార్క్ ఎక్స్‌టెన్సన్‌లో ఇల్లు కోల్పోయిన తమకు 2005 ఏడాదిలో నష్టపరిహారం మంజూరు చేసారని, తదుపరి ప్రభుత్వం చేపట్టిన రెండు సర్వేల్లో నిర్వాసితుల జాబితాలో తమ పేర్లు కొనసాగాయని, ఇటీవల చేపట్టిన సర్వేలో తమ పేర్లను తొలగించి ఈ నెల 8న సచివాలయంలో జాబితా ప్రదర్శించారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

కేబుల్ ఆపరేటర్ సంఘాల నిరసన

ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ పథకంపై సీఎం చంద్రబాబు కేబుల్ ఆపరేటర్ సంఘాల నేతలతో రివ్యూ మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ), ఫైబర్ నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ (ఎఫ్ఓఎఫ్), మల్టీ సర్వీసెస్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల శ్రీరామ్, మల్టీ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు కొణతాల ప్రకాష్, ఎఫ్ఓఎఫ్ జిల్లా అధ్యక్షుడు నడింపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్న ఫైబర్ నెట్ పథకం రానురాను దిగజారిపోతుందని, 2017లో ప్రారంభించి ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ, ల్యాండ్ ఫోన్‌ను నాణ్యతతో కూడిన సేవలు తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో కొనసాగుతున్నాయని, ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ఏపి ఫైబర్‌లో ఉన్నఫలంగా వందలాది మంది సిబ్బందిని తొలగించడంతో సేవలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెటాప్ బాక్స్‌లపై రూ. 59 రెంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో ఇంచార్జి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

మత్స్యకార భరోసా అందలేదు

అచ్యుతాపురం రూరల్: అర్హులైన మత్స్యకారులకు మత్స్యకార భరోసా అందలేదని మండల వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మావతి శ్రీనివాస్ అన్నారు. అర్హులైన మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందేలా న్యాయం చేయాలంటూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. బోటుకు ఇద్దరు చొప్పున మత్స్యకార భరోసా అర్హులకు అందనీయకుండా పక్కదోవ పట్టించారని, సుమారు 200 మంది అర్హులైన మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందలేదని తెలిపారు. అవకతవకలపై విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలన్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

చెరకు రైతుకు రవాణా చార్జీలు చెల్లించాలి

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన వారికి రవాణా ఖర్చులు, వెయిటింగ్ చార్జీలు అందించాలని బుచ్చెయ్యపేటకు చెందిన పలువురు చెరకు రైతులు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌కు చెరకు కాటాల నుంచి లారీల ద్వారా చెరకును తరలించాల్సిన కాంట్రాక్టర్ చెరకును పూర్తిగా తరలించకుండా మధ్యలోనే ఆపేయడంతో రైతులే సొంత ఖర్చుతో తరలించారని, ఫ్యాక్టరీ మరమ్మతులతో క్రషింగ్ నిలిచిపోవడంతో ఫ్యాక్టరీ అధికారులు రవాణా ఖర్చులతో పాటు వెయిటింగ్ ఛార్జీలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ కాంట్రాక్టర్‌కు రవాణా ఛార్జీలు చెల్లించిన అధికారులు రైతులకు మాత్రం ఇవ్వలేదని రైతులు గోపిశెట్టి శ్రీను, గాడి శ్రీను, రమణబాబు,ఐయితరెడ్డి రమణ తదితరులు తెలిపారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి పత్రం అందించారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన బుచ్చెయ్యపేట చెరకు రైతులు

భూ పంపకాల్లో వివాదం



దేముడమ్మ

గతంలో కుమారుడితో పాటు కుమార్తెలకు సమానంగా పంచి మూడు భాగాలుగా ఏర్పాటు చేసుకుని సాగుతో పాటు రెవెన్యూ రికార్డుల్లో ముగ్గురి పేరున నమోదు చేయించుకున్న పంపకాలను కాదని కొడుకు ఇబ్బందులు పెడుతున్నాడని చోడవరం మండలం పీఎస్ పేట గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు బండారు దేముడమ్మ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు తెలిపింది. నడవలేని ఆమె కుమార్తె సహాయంతో ఆటోలో కలెక్టరేట్‌కు చేరుకుని తనకు భర్త మూలంగా, స్వార్జితంగాను వచ్చిన భూమి వివరాలతో పీజీఆర్ఎస్‌లో నమోదు చేసింది. ఆర్‌వోఆర్ కేసులు, ఎంఎల్‌సీసీ మీటింగ్‌లకు కూడా తాము హాజరవుతున్నామని, అయినా పరిష్కారం దొరకడం లేదని ఆమె కుమార్తె బోకం పైడితల్లమ్మ తెలిపింది.

దస్తావేజు ఇవ్వకుండా వీఆర్వో వేధిస్తున్నారు...



ఈరుగుల పైడిరాజు

ల్యాండ్‌పూలింగ్ ద్వారా సంపతిపురం గ్రామంలో సర్వే నెం.286/5లో 1.28 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుని బదులుగా సర్వే నెం .284/30లో 378 చదరపు గజాల ప్లాట్‌ను తమ పేరున దస్తావేజు - 8333/2023 లో రిజిస్ట్రేషన్ చేశారని, కానీ దస్తావేజులు ఇవ్వకుండా అప్పటి వీఆర్వో శ్రీనివాసరావు ఇబ్బందులకు గురి చేశారని అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి చెందిన ఈరుగుల పైడిరాజు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. బదిలీపై మరోచోటకు వెళ్లినప్పటికీ తన పేరున గల దస్తావేజులు ఇవ్వడం లేదని, అతని వద్ద ఉన్న దస్తావేజు పత్రాన్ని ఇప్పించడంతో పాటు అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వికలాంగుడి భూమి కబ్జాకు యత్నం..



అర్జీ అందిస్తున్న అక్కిరెడ్డి అప్పారావు

చీడికాడ మండలం చినగోగాడ గ్రామంలో ఉన్న తన భూమి రికార్డులు ట్యాంపరింగ్ చేసి భూకబ్జాకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ జిల్లా గాజువాక మండలం నాతయ్యపాలెం గ్రామానికి చెందిన వికలాంగుడు అక్కిరెడ్డి అప్పారావు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చినగోగాడ గ్రామం సర్వే నెం.10-6లో 35 సెంట్ల భూమిని 2006లో కొనుగోలు ద్వారా వచ్చిందని, సదరు భూమిని తానే సాగుచేసుకుంటున్నానని, తాను వికలాంగుడిని కావడం, విశాఖ జిల్లాలో నివాసముండడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనకు తెలియకుండా తన భూమిని వారి పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించి తమ భూమిని కాపాడాలని కోరారు.

పూటకో మాట.. రోజుకో నిబంధన

- గందరగోళంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ
- యూటీఎఫ్ ధ్వజం

అనకాపల్లి: పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో లోపాలను సవరించాలని, పూటకోక మాట.. రోజుకో నిబంధనలతో విద్యావ్యవస్థను గందరగోళంలోకి నెట్టడం జరుగుతుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొందవి చిన్నబ్బాయ్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్య వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తూ టీచర్ల బదిలీలు, పదోన్నతులను ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టిందన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు జీవో నంబర్ 117 ను రద్దు చేస్తామని ఏడాదిపాటు చెబుతున్నప్పటికీ, ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు, ఆ జీవోలో ఉన్న ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని కొనసాగించడం తగదన్నారు. హై స్కూళ్లలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40 గా ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 1:20 గా ఉండాలని, యూపీ పాఠశాలలను ఎత్తివేయడం వల్ల పల్లె విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని పేర్కొన్నారు. రేషనలైజేషన్‌కు ఏప్రిల్ 23 నాటి విద్యార్థుల రోల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. బదిలీలు, పదోన్నతులకు స్థిరమైన మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. సమస్యల సాధన కోసం ఈనెల 15న రాష్ట్ర స్థాయి ధర్నా విజయవాడలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యుటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బోయిన వెంకటరావు, సహాధ్యక్షుడు రొంగళి అక్కునాయుడు, కోశాధికారి రాజేష్, కార్యదర్శులు సూర్య ప్రకాష్, రాజునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొంది చిన్నబ్బాయ్

గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీతకు స్పీకర్ సత్కారం



సీడీపీవో మేరీ సువార్తను సత్కరిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సీడీపీవో మేరీ సువార్తను స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సత్కరించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి కనపరుస్తూ, ఆన్‌లైన్ సంగీతంలో రాణించడం అభినందనీయమని స్పీకర్ పేర్కొన్నారు.

ఆశా కార్యకర్తపై దాడికి పాల్పడిన నర్స్‌పై చర్యలు తీసుకోవాలి



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

అనకాపల్లి: కశింకోట మండలం మూలపేట గ్రామం ఆశా కార్యకర్తపై దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)జిల్లా నాయకులు ఎల్.శాంతి, ఈ.పార్వతి, కె.వరలక్ష్మి, బి రామలక్ష్మిలు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేసి, వైద్యాలయంలో సూపరిటెండెంట్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ ఆస్పత్రికి గర్భిణిని డెలివరీకి తీసుకువచ్చిన కశింకోట మండలం మూలపేట ఆశా కార్యకర్త సిహెచ్ మాధవిపై రాత్రి ఎన్టీఆర్ ఆసపత్రిలో 'మేటి అసిస్టెంట్' సరళ మిశ్రా అకారణంగా దాడి చేసిందన్నారు. ఆశాలకు భద్రత కల్పించాలని, ఆశా కార్యకర్తను దుర్భాషలాడిన సరళ మిశ్రాపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్యకళ, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 20 అర్జీలు



దివ్యాంగురాలి సమస్య వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలు ఫిర్యాదుల పరిష్కార వేదికకు 20 అర్జీలు వచ్చాయి. తమ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి అంశాలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరిత గతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయానికి అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

బంగారం తాకట్టు విడిపించాలని...

తనకు నగదు అవసరమై బాబాయి వరస అయిన నారాయణరావు పేరు మీద అనకాపల్లి అన్నపూర్ణ బ్యాంక్‌లో 5.5 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టానని, అయితే తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించాలని కోరగా తన సొంత ఖర్చులకు రూ.2 లక్షలు ఇస్తేనే విడిపిస్తానని అంటున్నారని అనకాపల్లి మండలం మార్టూరుకు చెందిన గిసాల కుమారి తెలిపింది. దీనిపై గ్రామ పెద్దల సమక్షంలో పెట్టినప్పటికీ సమస్య పరిష్కరించలేదని, దీంతో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

తన కుమారుడికి మెడికల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం వేయిస్తామని చెప్పడంతో విశాఖ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తన బంధువు ద్వారా అనకాపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్‌కు 2003 జూలై 1వ తేదీన రూ.5.10 లక్షలు ఇచ్చానని కాకినాడ జిల్లా పిఠాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అల్లం అప్పలనర్సయ్య తెలిపారు. ఆ హెడ్ కానిస్టేబుల్ అమరావతిలో డిప్యూటేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారని, త్వరలో ఉద్యోగం వేయిస్తానని చెప్పి నేటికీ ఉద్యోగం వేయించలేదని, దీంతో ఇచ్చిన నగదును ఇవ్వాలని కోరినా స్పందించడం లేదని తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసగించిన హెడ్ కానిస్టేబుల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మహిళలకు, దివ్యాంగులకు సత్యసాయి సంస్థల వితరణ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు

అనకాపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ రహదారి సేవా సంస్థ కార్యాలయంలో దివ్యాంగులకు వీల్ చైర్లు, మహిళలకు కుట్టు మిషన్లు, రైతులకు స్ప్రేయింగ్ యూనిట్లు పంపిణీ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఏపీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఈ ఉపకరణాలను భగవాన్ బాబా వారి తల్లి ఈశ్వరమ్మ డే సందర్భంగా జిల్లాకు 22 మందికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఏడుగురు మహిళలకు కుట్టు మిషన్లు, ఇద్దరు మహిళలకు జ్యూట్ కుట్టుమిషన్లు, ఏడుగురుకు వ్యవసాయదారులకు స్ప్రేయర్లు, ఆరుగురు వికలాంగులకు వీల్ చైర్లు అందజేసినట్టు తెలిపారు. సంస్థ సభ్యులు రాజశేఖర్, కామరాజు, అప్పలనాయుడు తదితరులతో పాటు జోనల్ ఇంచార్జిలు రామారావు, ప్రసాదు, లోవరాజు, రవిశంకర్, మహిళా యూత్ కో-ఆర్డినేటర్ భారతి, జాయింట్ సర్వీస్ కో-ఆర్డినేటర్ సరోజ, కన్వీనరు నాగరాజు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి గాయాలు

మాకవరపాలెం: ఉపాధి కూలీలపై తేనెటీగల దాడిలో ఐదుగురు కూలీలు గాయపడ్డారు. మండలంలోని జి.గంగవరం శివారు శ్రీరాంపురంలో సోమవారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఐదుగురు కూలీలు గాయనపడగా మిగిలినవారు అక్కడి నుంచి పరుగులు తీశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

పెద గరువులో వైద్య శిబిరం

40 మందికి చికిత్సలు, 10 మందికి రక్త పరీక్షలు



చిన్నారికి ఆరోగ్య పరీక్ష చేస్తున్న వైద్యుడు శ్రీనివాసరాజు

రోలుగుంట: అర్ల పంచాయతీ శివారు పెద గరువులో జ్వరాలపై సోమవారం పత్రికల్లో వచ్చిన వార్తపై వైద్య సిబ్బంది స్పందించారు. బుచ్చింపేట వైద్యుడు ఎస్.శ్రీనివాసరాజు ఫీల్డ్ సిబ్బందితో కలసి పెద గరువు గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 62 మంది జనాభా గల ఇక్కడ 40 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. పది మందికి రక్తపు పూతలు తీశారు. వారిలో కిలో ప్రవీణ్‌కుమార్(8)కి జ్వరమని నిర్ధారించి పీహెచ్‌సీకి రిఫర్ చేశారు. సిరిడి రాణి(7), కిలో ఆశ(5), కిలో పాలి (ఏడాదిన్నర వయసు)కి దగ్గు, జలుబుగా గుర్తించి మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. వాతావరణ మార్పులు, వేసవి ఎండలకు వైరల్ జ్వరాలు సాధారణమన్నారు. మరగకాచిన నీరు తాగాలని, నిల్వ ఆహారం తీసుకోకూడదని గ్రామస్తులకు సూచించారు.

పోలీస్ కస్టడీకి గర్నికం హత్యకేసు నిందితులు



విలేకరులతో మాట్లాడుతున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం: మండలంలో మేడివాడ యువకుడు కొలిపాక పవన్‌కుమార్‌ను గత నెల 6 వ తేదీన గర్నికం తిరుమల ఫంక్షన్‌హాల్ దగ్గర స్నేహితులు వేపాడ నరేంద్ర కుమార్, దుర్గాప్రసాద్, మైనర్ బాలుడితో కలిసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ హత్యకేసు, వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి సంబంధించి దుర్గా ప్రసాద్, నరేంద్రకుమార్‌లను రెండు రోజులు పోలీసు కస్టడీకి తీసుకున్నామని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తెలిపారు. దుర్గాప్రసాద్, నరేంద్రకుమార్ తూర్పుగోదావరి జిల్లాలో మూడు బైక్‌లు, కాకినాడ జిల్లాలో ఒక్కటి, గాజువాకలో ఒక్కటి, మొత్తం 5 బైకులను చోరీకి పాల్పడ్డారని, నిందితుల సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకుని, సంబంధిత పోలీసుస్టేషన్లకు అందజేశామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రఘువర్మ పాల్గొన్నారు.

పంట భూములను ఖాళీగా ఉంచొద్దు



ఉత్తమ రైతు కూండ్రపు నూకాలమ్మను సత్కరిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ లచ్చన్న

కశింకోట: పంట భూములను ఖాళీ ఉంచకుండా ఏదో పంట వేసి పచ్చగా ఉంచడానికి రైతులు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సిహెచ్.లచ్చన్న కోరారు. మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో ఉన్న మండల మెగా ప్రకృతి వనరుల కేంద్రం వద్ద మూడో విడత నవ ధాన్యాలను రైతులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట భూములను పంటలు వేయకుండా వృథాగా ఉంచరాదన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు విత్తనాలను రైతుల నుంచి సేకరించి పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఈ ఏడాది పండించిన నవ ధాన్య పంటల విత్తనాలను కూడా స్థానిక రైతుల నుంచి సేకరించి వచ్చే ఏడాది రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నవ ధాన్యాలను సకాలంలో నాటుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సమర్థంగా చేస్తున్న కూండ్రపు నూకాలమ్మను ఉత్తమ రైతుగా ఎంపిక చేసి దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. సర్పంచ్ వాసు, ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు అరుణ, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, వీహెచ్ఏ కిషోర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



చింతలపూడి లావణ్య వెంకటసత్యకుమార్, కొండపల్లి తరుణ్

అక్కిరెడ్డిపాలెం: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాకకు చెందిన చింతలపూడి లావణ్య వెంకటసత్యకుమార్, కొండపల్లి తరుణ్ వద్ద 2.4 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాలు ఉన్నాయని, వారు ఆటోనగర్ వద్ద ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు దాడి చేసి, వారి నుంచి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి మత్తు పదార్థాలను తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు విచారణలో యువకులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

కనుల పండువగా వెంకన్నకు చక్రస్నానం



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఈనెల 13న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సోమవారం స్వామివారికి శ్రీ చక్రస్నానం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరపారు. ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలకు శ్రీ చక్రస్నానం చేశారు. ఎమ్మెల్యే రాజుతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో ఈ నెల 13న తీగుల సరిచేయుట, కొత్త స్విచ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ టౌన్–2 ఫీడర్ పరిధిలో పూడిమడక రహదారి ఏరియా, శారదాకాలనీ, నెహ్రూచౌక్, ఎల్ఐసీ కార్యాలయం రహదారి, ఉమ్మలాడ జంక్షన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నాయీ బ్రాహ్మణ కాలనీపై నిర్లక్ష్య వైఖరి

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణ పురం గ్రామ పంచాయతీ మూలపేటలో నాయీ బ్రాహ్మణ కాలనీపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని, ఇక్కడ మౌలిక సదుపాయలు కల్పించడం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు తెలిపారు. మూలపేట గ్రామంలో కాలనీ వాసులతో సోమవారం ఆయన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని, వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని, రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించాలని డిమాండ్ చేశారు. కుక్కలు బెడద నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని, మురుగు దుర్వాసన నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

'పింఛన్ల పంపిణీ భారం మోపొద్దు'



ఎంపీడీవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కశింకోట: పింఛన్ల పంపిణీ విధుల నుంచి మినహాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో వి.వి. రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని భారం, యాప్‌ల్లో డాటా అప్‌లోడ్ చేయడంతో సతమతమవుతున్న తమపై మరింత భారం మోపొద్దని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాస రావు, కార్యకర్తలు కె. తనూజ, ఎస్. యర్రయమ్మ, బి. లక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీలు

నర్సీపట్నం: ప్రచార మాధ్యమాల్లో వచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నంలోని పాలిమర్ హోటల్‌లో తనిఖీలు చేశామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించామన్నారు. హోటల్‌లోని వివిధ రకాల ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించామని తెలిపారు. హోటల్స్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కూడా పదే పదే మరిగించిన ఆయిల్ వినియోగించరాదని అన్నారు. ఫిర్యాదులు వచ్చినట్టయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 921 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,970
రెండో రకం	3,770	4,330
మూడో రకం	3,300	3,650

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్–1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్–2: జగదీక వీరుడు అతిలోక సుందరి	
పర్తిసాయి	:హిట్–3
షిర్డీసాయి	సింగల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–17 యూనిట్లు, బీ పాజిటివ్–14, ఓ పాజిటివ్–18, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.



జోరుగా తినుబండారాల విక్రయాలు



పరదాల మాటున సాగుతున్న వ్యాపారాలు

వారపు సంత.. సమస్యల చింత

- కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు
- రోడ్లపైనే విక్రయాలు
- ఆదాయం ఉన్నా సౌకర్యాలు లేవు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్

అనకాపల్లి టౌన్: వారపు సంతలో ఏళ్ల తరబడి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వ్యాపారుల నుంచి క్రమం తప్పకుండా ఆశీలు వసూళ్లు చేస్తున్న పంచాయతీ పాలకులు ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవు. ప్రధానంగా వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో ప్రతీ వారం శనివారం సంత జరుగుతోంది. ఈ సంతకు సమీప వెంకుపాలెం సీతానగరం, మార్టూరు, బవులువాడ, మామిడిపాలెం, పాపయ్య సంతపాలెం, వేట జంగాలపాలెం, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు, వ్యాపారులు వస్తుంటారు. ఆయా గ్రామాల పరిధిలో క్వారీలు, క్రషర్‌లు, ఇటుక బట్టీలలో ఒడిశా కార్మికులు వచ్చి పనులు చేస్తుంటారు. వీరందరూ వారానికి సరిపడా కిరాణా, కాయగూరలు, తినుబండారాలు ఒక్కసారే కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇక్కడ కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎండలోనే వ్యాపారాలు..

ఇక్కడ చిరు వ్యాపారులు నానా ఇక్కట్లుకు గురవుతున్నారు. ఎండైనా వానైనా పరదాల మాటున, గొడుగు నీడనే వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరికి సరైన షెడ్లు లేవు. వారు కూర్చోని వ్యాపారాలు చేసుకోవడానికి దిమ్మలు కూడా లేవు. వర్షం పడితే మోకాళ్ల లోతు నీరు నిలిచిపోతోంది. కనీసం మంచినీటి సౌకర్యం లేదు. అత్యవసరమైతే నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాల్సిందే. ఇక్కడకు నిరక్షరాసులు ఎక్కువగా వస్తుంటారు. వారికి నాసిరకం వస్తువులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని అరికట్టాల్సిన అధికారుల జాడ కానరావడం లేదు. విశాలమైన సంత ఉన్నా, రోడ్లపైనే వ్యాపారాలు జరుగుతున్నాయి. దీంతో ఆ రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. క్వారీ లారీలు, బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కనీసం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండడం లేదు. జిల్లా నలుమూలల నుంచి ఆవులను, గేదెలు, నాటు కోళ్లను ఇక్కడకు అమ్మకాలు చేస్తుంటారు. వీటి ద్వారా ఆశీలు రూపంలో ఏటా పంచాయతీకి లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా, కనీస సదుపాయాలు సమకూర్చకపోవడంతో ఇటు చిరు వ్యాపారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నాసిరకం బిస్కెట్స్, సర్ఫ్ పాకెట్లు

నాసిరకం వస్తువుల అమ్మకాలు



ప్రతీ శనివారం వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేస్తుంటాను. ఇక్కడ తాగునీటి సదుపాయం లేదు. నాణ్యత లేని వస్తువులను అమ్ముతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

– బసంత్, ఒడిశా, కొనుగోలుదారుడు

సదుపాయాలు కల్పించాలి



సంతలో ఎటువంటి సదుపాయాలు లేవు. మండుటెండలో వ్యాపారం సాగిస్తున్నాను. క్రమం తప్పకుండా ఆశీలు చెల్లిస్తున్నాను. వర్షం వస్తే నీరు నిలిచిపోతోంది. పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. తక్షణమే సదుపాయాలు కల్పించాలి.

– పొలిమేర రామారావు, అనకాపల్లి

తూతూమంత్రంగా వేసవి శిబిరాలు

అనకాపల్లి: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు తూతూమంత్రంగా జరుగుతున్నాయని, దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొణతాల హరనాథ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా వేసవిలో శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. వీటితో జిల్లాలో వేసవి శిక్షణ తరగతులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (రుత్విక్కులు)

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు సిద్ధి లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గోకర్ణేశ్వర స్వామి బాలా త్రిపుర సుందరి దేవిల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శుద్ధపల్లి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో వివిధ రకాలైన మిఠాయిలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరపల్లి కృష్ణజీ, ఈవో బి. మురళీకృష్ణ, మున్సిపల్ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అహింసే పరమ ధర్మం



బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘాల ప్రతినిధులు



గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పైడారావు

అనకాపల్లి: అహింసే పరమ ధర్మమని ప్రబోధించిన మహనీయుడు గౌతమ బుద్ధుడని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు తెలిపారు. స్థానిక నెహ్రూ చౌక్ వద్ద గౌతమ బుద్ధుడు 2,569 జయంతి పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం పలువురు వక్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైడారావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో మండలంలో శంకరం పంచాయతీ పరిధిలో రెండు కొండల మధ్య గౌతమ బుద్ధుడు ధ్యానం చేసేవారన్నారు. అనకాపల్లి పడమర వైపు రెండు కిలోమీటర్ల దూరంలో కొన్ని వేల ఎకరాల పొలాల మధ్య ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన రెండు రాతి కొండలు బుద్ధుని కొండగా ప్రసిద్ధి చెందాయన్నారు. బౌద్ధ మత ప్రచారం కోసం ఆ రోజుల్లో దృఢ సంకల్పంతో తూర్పున రాతి కొండను రెండు అంతస్తులుగా దొలిచి పై గృహలో జ్ఞాన బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఏటా బౌద్ధ భిక్షువులు బొజ్జన్న కొండ వద్దకు వచ్చిన ప్రత్యేక పూజలు చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బల్లా నాగభూషణం, బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్ని యాదవ్, దూలం బూసిరాజు, బండి అప్పారావు బొబ్బిలి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: బుద్ధుడు చూపించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బల్లా నాగభూషణం కోరారు. పట్టణంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో బుద్ధుని 2569 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరావు, ఇమిడిశెట్టి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

దాణా గిన్నెల పంపిణీ



మృతి చెందిన పాడి రైతుల కుటుంబాలకు గ్రూపు బీమా పరిహారం అందజేత



తాళ్లపాలెం పాల సంఘం సభ్యులకు దాణా గిన్నెల పంపిణీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘంలో 145 మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో దాణా గిన్నెలను సోమవారం పంపిణీ చేశారు. గ్రూపు బీమా పథకంలో చేరి మృతి చెందిన పాడి రైతులు కర్రి గోవింద, తోరం చిన్నంనాయుడుల కుటుంబ సభ్యుల నామినీలకు రూ.లక్ష, రూ.రెండు లక్షల వంతున ఆర్థిక సహాయాన్ని అందించి ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, ఏరియా సూపర్ వైజర్ కాయల సత్యనారాయణ, వేతన కార్యదర్శి విరోదుల శ్రీను, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు



విత్తనాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

మాకవరపాలెం : రసాయనాలు లేకుండా చేపట్టే ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటను పొందొచ్చని వ్యవసాయశాఖ పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారం రైతుసేవా కేంద్రం వద్ద ఈ గ్రామంతోపాటు మరికొన్ని గ్రామాల్లోని రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నవధాన్యాల విత్తన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలను అందిస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగుమందులు లేని సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా 2700 మంది రైతులకు ఈ నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్నట్టు ప్రకృతి సేద్యం మండల ఇన్‌చార్జ్ కమిత తెలిపారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు,ఎంపీడీవో ఛాయాసుధ, ఏవో చిరంజీవి, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

రవాణా సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ డ్రైవర్లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. లంకెలపాలెం కూడలిలో సమ్మె వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్డు రవాణా రంగం కీలకపాత్ర వహిస్తోందన్నారు. ఈ రంగంలో ఆటో, మోటార్, బస్, లారీ, వ్యాన్లు ద్వారా ప్రయాణికులను, సరకులను చేరవేస్తున్నారన్నారు. ఇలాంటి రంగంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దీనికి నిరసనగా సదరు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాత వెంకటస్వామి, నరసింగరావు, ఠాగూర్, మధు, నరసింగరావు, రమణ పాల్గొన్నారు.

కమనీయంగా శివ పార్వతుల కల్యాణోత్సవం



శివ లింగం అలంకరణ



సర్వమంగళాంబ అలంకరణ



పల్లకిలో శివ పార్వతుల విగ్రహాల ఊరేగింపు

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం రాత్రి శివ పార్వతుల వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిపై బ్యాండ్ మేళాతో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ప్రజలు స్వామివార్లను దర్శించి పూజలు చేశారు. అనంతరం అందంగా నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై నిలిపారు. శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. గణేష్ పూజ, విశ్వక్షేన పూజ, స్వామి విగ్రహాలకు యజ్ఞోపవీతం వేయడం, కన్యాదానం, శుభ ముహూర్తాన విగ్రహాల తరఫై జీలకర్ర, బెల్లం పెట్టడం, మంగళ సూత్ర ధారణ, తలంబ్రాలు వేయడం, బ్రహ్మముడి, కర్పూర దండలు వేయడం తదితర ఘట్టాలతో వైభవంగా నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం భక్తి పారవశ్యంతో తిలకించి ఆనందపరవశులయ్యారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఉదయం ఆలయంలో శివలింగానికి అమృతాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివలింగాన్ని అందంగా అలంకరించారు. సర్వమంగళాంబ విగ్రహాన్ని కూడా ఆభరణాలు, వస్త్రాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కల్యాణం పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

వరాహ లక్ష్మీనృసింహ స్వామికి తులసి పూజ



స్వామివారికి తులసి పూజ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో వైశాఖ మాస పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, సహస్ర తులసి పూజ, రెండో విడత చందనం సమర్పణ, సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మి ఆండాళ్ అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, రాత్రి 7 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చదరంగం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం చదరంగం, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 12వ రోజు పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో జరిగింది.



విద్యార్థులకు భోజనాలు

కశింకోట తహసీల్దార్‌గా సత్యనారాయణ



తహసీల్దార్ సత్యనారాయణ

కశింకోట: స్థానిక తహసీల్దార్‌గా జి. సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాయకరావుపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎ. శ్రీనివాసరావు అనారోగ్యరీత్యా గత నెల నుంచి దీర్ఘకాలిక సెవలపై ఉండటంతో రెవెన్యూ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా ఆయనను నియమించారు. ఆయన గతంలో ఇక్కడ పని చేశారు. మళ్లీ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

రాయితీపై సమీకృత పశు దాణా పంపిణీ



బి.కె.పల్లిలో సమీకృత దాణాను రైతుకు అందిస్తున్న దృశ్యం

కోటవురట్ల: సమీకృత దాణాను రాయితీపై అందిస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ కోరారు. సమీకృత దాణా పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ మండలానికి 10 టన్నుల సమీకృత దాణా రాగా, రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ద్వారా రూ.1100 విలువ చేసే 50 కిలోల సమీకృత దాణాను 50 శాతం రాయితీ పోను రూ.550కు అందిస్తున్నామని తెలిపారు. రాయితీపై ఒక్కొక్క పాడి పశువుకు 90 రోజులకు గాను 150 కిలోల దాణాను అందిస్తున్నామని, గరిష్ఠంగా ఒక రైతుకు మూడు పశువులకు రాయితీపై దాణా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



గణపర్తిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మునగపాక: ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు హెచ్చరించారు. మండలంలోని గణపర్తి గ్రామంలో ఆక్రమణలకు గురైన పాకలను తొలగించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు బందోబస్తు నిర్వహించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. స్వచ్ఛందంగా పాకలు తొలగించి అధికారులకు సహకరించాలన్నారు. ఆర్ఐ పడాల్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.